ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 17 సెప్టెంబరు 2025



ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛతా పక్వాడా


గరుగుబిల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం తొలిరోజు ఉపాధ్యాయులు విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఇక 17, 18 తేదీల్లో అవగాహన సదస్సులు, 19న పచ్చదనం పరిశుభ్రత, 22, 23 తేదీల్లో చేతుల పరిశుభ్రత , 24, 25 తేదీల్లో స్వచ్ఛతా దినం, 26న హైజానిక్, 27న స్వచ్ఛతా ఎగ్జిబిట్, 28, 29 తేదీల్లో స్వచ్ఛతపై ప్రణాళికల తయారీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 30న బహుమతులు అందజేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

చదువుకోవాలంటే కొండ దిగాల్సిందే!

- గిరిజన విద్యార్థులకు తప్పని కష్టాలు
- బడికి చేరాలంటే వాగులు, గుట్టలు దాటాల్సిన దుస్థితి
- రహదారుల్లేక తీవ్ర అవస్థలు
- గిరిజన పాఠశాలల్లో సౌకర్యాలు కరువు
- రేకుల షెడ్లు, పూరిపాకల్లోనే బోధన
- అత్యధికులు డ్రాపౌట్లుగా మారుతున్న వైనం



ఈ చిన్న రేకులషెడ్డులోనే రాయిలంక గిరిజన ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తున్న దృశ్యం



కొండ దిగి మర్రిపాడు పాఠశాలకు వెళ్తున్న ఉసిరికిపాడు విద్యార్థులు

సీతంపేట రూరల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో గిరిజన చిన్నారులకు బడి కష్టాలు తప్పడం లేదు. రోజూ కొండ దిగి, గుట్టలు దాటి కిలోమీటర్ల మేర నడిచి పాఠశాలలకు చేరు కోవాల్సి వస్తోంది. ప్రధానంగా ఉసిరికిపాడు, మూలగూడ, రంగంవలస, గూడంగి, ఎగువ ద్వారబంధం, దిగువ ద్వారబంధం తదితర గిరిశిఖర గ్రామాల చిన్నారులకు నిత్యం ఈ అవస్థలు తప్పడం లేదు. సుమారు నాలుగు కిలోమీటర్లు నడిచి కొండ దిగిన తర్వాత బాషా వలంటీర్ సాయంతో పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామాలకు రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో వారి బాధలు రెట్టింపవుతున్నాయి. మరోవైపు బడులకు పక్కా భవనాలు లేకపోవడంతో రేకుల షెడ్లు, పూరిపాకల్లోనే వారు అక్షరాలు నేర్చుకోవాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా కొండ దిగితేకాని చదువుకోలేని పరిస్థితి నెలకొనడంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి దూరం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో డ్రాపౌట్ల సంఖ్య పెరుగుతోంది. ఈ సమస్యను ఎన్నిసార్లు అధికారులకు తెలిసినా.. కనీస చర్యల్లేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 20 సబ్‌ప్లాన్ మండలాల్లో 191 గిరిజన ప్రైమరీ పాఠశాలలు (జీపీఎస్) ఉన్నాయి. వీటిల్లో సుమారు 4వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే, 40 పాఠశాలలకు పక్కా భవనాలు లేవు. జగతిపల్లి, ఎగువదారబ, రాయిలంక, మూల లంక, చిన్నపల్లంకి తదితర పాఠశాలలను రేకులషెడ్లు, పూరిపాకల్లో నిర్వహిస్తున్నారు. వర్షం పడితే నీరు కారిపోతుండడంతో గిరిజన చిన్నారులు నానా అవస్థలు పడుతున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మండలంలో 75 పాఠశాలలు ఉండగా వీటిలో 12 పాఠశాలలకు పక్కా భవనాలు లేవు. ఇక్కడ కూడా రేకుల షెడ్లలోనే విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. చావిడివలస, మర్రిపాడు, కిరప, కిండంగి, కిల్లాడ, సీది, మానాపురం పాఠశాలల్లో ఒక్క భవనంలోనే ఐదు తరగతుల విద్యార్థులను కూర్చో బెట్టి ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో ఆరుబయట పిల్లలను కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. దీంతో అష్టకష్టాల నడుమ అడవి బిడ్డల చదువులు సాగుతున్నాయి.

వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. కూటమి చొరవ

గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాల్సిన గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. నాడు-నేడు పథకంలో భాగంగా అదనపు భవనాల నిర్మాణాలకు అరకొర నిధులను మంజూరు చేసింది. దీంతో మన్యంలోని చాలా వరకు పాఠశాలలు పక్కా భవనాలకు నోచుకోలేదు. కొన్నిచోట్ల పునాది దశలోనే పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఎస్ఎస్ఏ (సమగ్ర శిక్షా అభియాన్) నిధులతో సీతంపేట

(మిగతా 8వ పేజీలో...)



రామతీర్థంలో పవిత్రోత్సవాలకు శ్రీకారం

నెల్లిమర్ల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా రామతీర్థం దేవస్థానంలో నాలుగు రోజులపాటు జరగనున్న రామచంద్ర స్వామి పవిత్రోత్సవాలకు మంగళవారం సాయంత్రం అర్చకులు శ్రీకారం చుట్టారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, రుత్విక్ గ్వారణం తదితర ప్రక్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాబోయే మూడు రోజులు దేవస్థానంలో శ్రీమద్రామాయణ పారాయణం, సుందరకాండ హవనాలు, దివ్యప్రబంధం సేవా కాలాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలన్నీ ఈవో వైఎస్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకులు చేపట్టనున్నారు.

పైడిమాంబ సిరిమాను, ఇరుసుమాను చెట్ల గుర్తింపు

- నేడు కొండతామరాపల్లిలో పూజలు

7లో

అభివృద్ధికి దూరంగా తుంబలి

- కనీస సౌకర్యాలు లేని వైనం
- రేకుల ఇళ్లలోనే గిరిజనుల నివాసం

6లో

339 ప్రత్యేక వైద్య శిబిరాలు: డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 339 ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో స్టేట్ నోడల్ అధికారి పి.గీతాపద్మజ, ప్రోగ్రాం అధికారులతో సమీక్షించారు. నేటి నుంచి అక్టోబరు 2 వరకు జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కౌంటర్లను ఏర్పాటు చేసి నిర్దేశించిన ఆరోగ్య పరీక్షలు, వైద్యసేవలు అందించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం స్పెషలిస్టు వైద్యులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది అక్కడకు ముందుగా చేరుకోవాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్, రక్తహీనత గుర్తించే టెస్టులు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. పోషకాహార ఆవశ్యకత, ఆరోగ్య జాగ్రత్తలపై కౌన్సెలింగ్ ఇవ్వాలని క్షయ నిర్ధారణ పరీక్షలు చేయాలని వైద్యాధికారులకు సూచించారు.

ముగిసిన సదస్సు

- జిల్లా అభివృద్ధిపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



సదస్సులో ఎస్పీ, కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సు ముగిసింది. రెండో రోజు మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా అభివృద్ధిపై దిశానిర్దేశం చేశారు. మన్యాన్ని ప్రగతి పథంలో నడిపించడంలో కీలకంగా వ్యవహరించాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్పీ మాధవరెడ్డిలకు సూచించారు. కాగా భూ సమస్యలపై చర్చించిన సమయంలో గతంలో సీసీఎల్ఏ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవంతో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఈ సందర్భంగా కొన్ని సూచనలు ఇచ్చారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే విజయచంద్ర

6లో



జలాశయాలకు జలకళ

- పోటెత్తుతున్న వరద



తోటపల్లి స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి/జియ్యమ్మవలస, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా ఎగువ ప్రాంతం ఒడిశాతో పాటు జిల్లాలోనూ విరివిగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయాలకు వరద పోటెత్తుతోంది. గరుగుబిల్లి మండలం తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి మంగళవారం 10 వేల క్యూసెక్కులకు పైబడి వరద నీరు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు 6 వేల క్యూసెక్కులను విడుదల చేశారు. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి సుమారు 1,320 క్యూసెక్కులు సర ఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 104.54 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. ఇక జియ్యమ్మవలస మండల పరిధి వట్టిగెడ్డ రిజర్వాయర్ స్పిల్‌వే గేట్ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాంలో భారీ వర్షం కురవడంతో రిజర్వాయర్‌లోకి భారీగా వరద చేరుతుందని ఏఈ శంకర రావు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 121 మీటర్ల మేర నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

మనుమకొండను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్

భామిని, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మనుమకొండను ఆదర్శంగా తీర్చిదిద్దుదామని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. మంగళవారం ఆ గ్రామంలో ప్రజలతో ఆయన సమావేశమ య్యారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య సేవలు, మహిళా సంఘాల పనితీరు, వ్యవసాయంపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్‌చార్జి పీవో మాట్లాడుతూ.. గ్రామంలో సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మనుమకొండ సుందరీకరణలో గ్రామస్థులు భాగస్వాములవ్వాలని కోరారు. అనం తరం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. క్రమపద్ధతిలో పౌష్టికాహారాన్ని అందించాలని సూచిం చారు. అక్కడి నుంచి నేరుగా బత్తిలి పీహెచ్‌సీకి చేరుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసు కున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం భామిని ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు.



మనుమకొండ గ్రామస్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి



పెదబొండపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

గరుగుబిల్లి, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం పెద్దూరు కొండ దిగువ ప్రాంతంలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. జీవో 30 మేరకు నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిబంధనల మేరకు లబ్ధిదారులను రెగ్యులైజ్ చేయాలని సూచించారు. అర్హత కలిగిన వారి రెగ్యులైజేషన్‌కు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ పి.బాలను ఆదేశించారు. ఆ తర్వాత శివరాంపురంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. రైతులు సాగు చేసే పంటల వివరాల నమోదులో తేడాలుంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పంటల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. అక్కడి నుంచి నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కుల ధ్రువీకరణ పత్రాల మంజూరును పరిశీలించారు. మ్యూటేషన్లు, వెబ్ ల్యాండ్‌తో పాటు రెవెన్యూ సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. గ్రామస్థాయిలో వీఆర్‌వోలు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించా లన్నారు. యూరియాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. యూరియాను సక్రమంగా పంపిణీ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

ఆశ్రమ పాఠశాలలు ఆహ్లాదకరంగా ఉండాలి

పార్వతీపురం రూరల్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్


(మిగతా 8వ పేజీలో...)

ఆదమరిస్తే.. ఆసుపత్రికే!

- ఎం.అల్లువాడ - తుంబలి రోడ్డుకు ఆనుకుని భారీ గుంతలు
- మరమ్మతు పనుల్లో భాగంగా తవ్వి వదిలేసిన బీఎస్ఎన్ఎల్ సిబ్బంది
- మూడేళ్లు గడిచినా.. పూడ్చలే!
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు
- ఆందోళనలో వాహనదారులు



ఎం.అల్లువాడ - తుంబలి దారిలో భారీ గుంత



గుంత చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

జియ్యమ్మవలస, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలంలో ఎం.అల్లువాడ - తుంబలి గ్రామాల ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనున్న భారీ గుంతల కారణంగా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇటువైపు రాకపోకలు సాగించలేకపోతున్నారు. వాస్తవంగా టవర్ల మరమ్మతు పనుల్లో భాగంగా మూడేళ్ల కిందట బీఎస్ఎన్ఎల్ అధికారులు ఎం.అల్లువాడ - తుంబలి గ్రామాల రోడ్డు పక్కన నాలుగైదు పెద్ద పెద్ద గుంతలు తవ్వారు. కనెక్షన్లకు మరమ్మతులు చేసేసి చేతులు దులుపుకున్నారు. కానీ వాటిని పూడ్చకుండా అలానే వదిలేశారు. ఏడు నుంచి తొమ్మిది అడుగుల లోతుతో ఒక్కో గుంత ఉండడంతో ఇటువైపుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పక్కనే 50 మీటర్ల పరిధిలో మలుపుల వద్ద ఉన్న ఈ గుంతల

(మిగతా 8వ పేజీలో...)

రైతులూ.. జాగ్రత్త

- క్రిమిసంహారక మందుల పిచికారీలో అప్రమత్తత అవసరం
- అధికారుల సూచనలు పాటించండి
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయం



నెల్లిమర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందులు అంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. అవి మన శరీరంలోకి వెళ్లినా.. వాటి వాసన మనం పీల్చినా ఆరోగ్యానికి హానికరం. పంటలపై పురుగు మందులు పిచికారీ చేయడంపై అవగాహన లేకపోవడం... సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి కారణాలతో రైతులు, వ్యవసాయ కూలీలు అనారోగ్యం పాలవడం... ప్రాణాల మీదకు తెచ్చుకోవడం వంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల పంటలను ఆశించే చీడపీడల నివారణకు లేదా కలుపు నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఆ సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అధికారులు సూచించినవే..

క్రిమి సంహారక మందులు చల్లడానికి వ్యవసాయ శాఖ సూచించిన స్ప్రేయర్లు (పరికరాలు) మాత్రమే వాడాలి. మొక్కల స్థాయిని బట్టి స్ప్రేయర్లు ఉపయోగించాలి. పత్తిలో హ్యాండ్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్ల కన్నా తైవాన్ స్ప్రేయర్ల ద్వారా మొక్కల పై నేరుగా మందు పిచికారీ చేసే వీలుంటుంది.

అవగాహన అవసరం..

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగు మందులపై రైతులు అవగాహన పెంచుకోవాలి. సంబంధిత దుకాణాల్లో నాలుగు రంగుల్లో పురుగు మందులు లభ్యమవుతాయి. వీటిలో ఏవి విషపూరితమైనవన్న విషయం తెలుసుకోవాలి. పుర్రె గుర్తుతో ఆకుపచ్చ, నీలి, పసుపు రంగులతో కూడిన డబ్బాలు ఉంటాయి. పుర్రెగుర్తుతో కూడిన ఎర్ర రంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నంతో ఉంటే తక్కువ విషపూరితమని తెలుసుకోవాలి.

ఇలా చేయాలి..

- పురుగుమందు డబ్బా మూత నోటితో తీయవద్దు. మందు ద్రావణాన్ని చేతితో కలపవద్దు. అవసరమైన మందు ఒకేసారి కలుపుకోవాలి.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయవద్దు. పిచికారీ సన్నగా, తుంపరల్లా ఉండేలా చూడాలి.
- మందు తగిన మోతాదులోనే పిచికారీ చేయాలి, మోతాదుకు మించితే పంటలకు ప్రమాదం.
- ఒకేసారి రెండు లేదా మూడు రకాల పురుగు మందులు కలిపి పిచికారీ చేయవద్దు.
- చేతులకు గ్లౌజ్‌లు, కళ్లద్దాలు, ముఖానికి మాస్క్, తలకు టోపీ లేదా రుమాలు ధరించాలి. చేతివేళ్లకు గోళ్లు పెంచకూడదు, పత్తిలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి.
- ఉదయం, సాయంత్రం గాలి వీస్తున్న వైపే వెళ్లి పిచికారీ చేయాలి.
- పురుగుమందు పిచికారీ సమయంలో పొగతాగరాదు, పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు తినవద్దు. చేతులు నోటిలో పెట్టుకోవడం, కళ్లు నలుపుకోవడం వంటివి అస్సలు చేయవద్దు.
- పంట ఏపుగా పెరిగి ఉంటే చేతిపంపుతో కాకుండా స్రేయర్‌తోనే పిచికారీ చేయాలి.
- గాయాలైన చేతులతో మందు పిచికారీ చేయకూడదు. పిచికారీ పూర్తయిన వెంటనే కాళ్లు, చేతులు సబ్బుతో కడుగు కోవాలి. తలస్నానం చేయాలి.
- పిచికారీ చేసేటప్పుడు ప్రత్యేకమైన దుస్తులు మాత్రమే ధరించాలి. వాటిని విడిచిన తరువాత మిగతా దుస్తులతో కలిపి శుభ్రం చేయకూడదు.
- చిన్నపిల్లలకు పురుగు మందులను సాధ్యమైనంత దూరంగా ఉండేలా జాగ్రత్త పడాలి.
- పిచికారీ అనంతరం వినియోగించిన పురుగు మందు డబ్బాలను గొయ్యి తీసి పాతిపెట్టాలి.

మందు ప్రభావానికి గురైతే...

పురుగు మందుల ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేలు పెట్టి వాంతి చేయించాలి. మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య వస్త్రం ఉంచాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత బాగా తగ్గితే దుప్పటి కప్పి వెచ్చగా ఉంచాలి. సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలను వైద్యులకు తెలియజెప్పాలి.

అభివృద్ధికి దూరంగా తుంబలి

- రేకుల ఇళ్లలోనే గిరిజనుల నివాసం
- కనీస సౌకర్యాలు లేని వైనం



తుంబలి గిరిజన గ్రామం

సీతంపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో అది ఒక మారుమూల గిరిజన గ్రామం. మొత్తం 43 గిరిజన కుటుంబాలు అభివృద్ధికి దూరంగా నివాసం ఉంటున్నాయి. నేటికీ శిథిలావస్థలో ఉన్న రేకుల ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారు అక్కడి ప్రజలు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మారుతున్నా తమ తలరాతలు మాత్రం మారడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ పూతికవలస పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామం తుంబలిలోని గిరిజనుల దుస్థితి. ప్రభుత్వ పథకాలు ఎంతో కొంత అందుతున్నప్పటికీ గ్రామంలోని సమస్యలు మాత్రం పరిష్కారం కాకుండా అలాగే ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు లేవు..

తుంబలి గ్రామస్థులను ఏళ్ల తరబడి తాగునీటి సమస్య వేధిస్తోంది. అంతర్గత సీసీ రహదారులు లేవు. వర్షాకాలం వచ్చిందంటే బురద నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. స్థానికంగా 3 వేల లీటర్ల మంచినీటి ట్యాంక్ ఉన్నప్పటికీ గ్రామస్థులందరికీ నీరు చాలడం లేదు. వేసవి కాలం వచ్చిందంటే మంచినీటి కోసం వీరు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. ఈ గిరిజనులకు పక్కా గృహాలు లేవు. గతంలో గ్రామస్థులు సొంతంగా నిర్మించుకున్న సిమెంట్ రేకులు, మట్టి గోడల ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఓ ఇంటి మట్టి గోడ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



అసంపూర్తిగా ఉన్న గృహాలు

ప్రభుత్వం ఆదుకోవాలి..



మా గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులు చెల్లిస్తే గృహ నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. గృహ నిర్మాణాలు నిలిచిపోవడంతో ఇంటి పునాదులు దెబ్బతింటున్నాయి. ప్రజా ప్రతినిధులు మా గ్రామ అభివృద్ధిపై దృష్టి పెట్టి..ఆదుకోవాలి.

-కొండగొర్రి సత్యం, తుంబలి

కనీస సౌకర్యాలు కల్పించాలి..



మా గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలి. సీసీ రహదారులు, హౌసింగ్ వంటి పథకాలు మంజూరు చేయాలి. మౌలిక సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

-అన్నాజీరావు, తుంబలి కాలనీ

హౌసింగ్ బిల్లులు రాక..

తుంబలి కాలనీలో నివాసం ఉంటున్న గిరిజనులకు 2017, 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో 20మందికి గృహాలు మంజూరయ్యాయి. అప్పట్లో వీరు గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. మొదటి విడత పునాది వరకు బిల్లులను హౌసింగ్ అధికారులు చెల్లించారు. ఆ తరువాత బిల్లులు చెల్లించకపోవడంతో గృహ నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మరికొందరు తమ సొంత డబ్బుతో శ్లాబుల వరకు నెట్టుకొచ్చారు. కానీ పూర్తి చేయలేకపోయారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా... అక్కడి గిరిజనుల సొంతింటి కల నెరవేరడం లేదు.

యూనిట్ విలువ పెంపుతో మేలు

- గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం
- హౌసింగ్ డీఈఈ రెడ్డి వేణుగోపాల్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



బొబ్బిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గతంలో మంజూరై... నిర్మాణం పూర్తి చేయలేకపోయిన గృహ లబ్ధిదారులకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఇన్‌చార్జి హౌసింగ్ డీఈఈ రెడ్డి వేణుగోపాల్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో హౌసింగ్ ప్రగతి గురించి ఆయన వివరించారు.

ప్రశ్న: కూటమి ప్రభుత్వం గృహ లబ్ధిదారులకు చేకూర్చిన ప్రయోజనం ఏమిటి?

జవాబు: జగనన్న లేఅవుట్లలో ఇళ్లు పొంది నిర్మాణం పూర్తి చేయలేకపోయిన ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు యూనిట్ విలువను పెంచారు. ఇందులో భాగంగా ప్రతి లబ్ధిదారునికి అడ్వాన్స్‌గా రూ.15 వేల చొప్పున చెల్లించారు. గత ప్రభుత్వ హయాంలో యూనిట్ విలువ రూ.1.80 లక్షలు ఉండేది. దీనికి అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున నిర్మాణ వ్యయాన్ని ప్రభుత్వం పెంచింది.

ప్ర: గృహ లబ్ధిదారులకు ఎంతమేరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయి?

జ: బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో రూ.912 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2016-19 సంవత్సరాలకు సంబంధించి బొబ్బిలి పట్టణంలో 133 మందికి రూ.2.14,56,000, రూరల్‌లో 385 మందికి రూ.9.95లక్షలు, బాడంగిలో 211 మందికి రూ.60.16 లక్షలు, రామభద్రపురం మండలంలో 300 మందికి రూ.8.70 లక్షల చొప్పున చెల్లించాలి.

ప్ర: కొత్తగా లబ్ధిదారులను ఎలా గుర్తించబోతున్నారు?

జ: గృహ లబ్ధిదారులకు సంబంధించి సర్వే నిర్వహించాం. బాడంగి మండలంలో 1,112, బొబ్బిలి రూరల్‌లో 2,229, అర్బన్‌లో 224, రామభద్రపురంలో 1,368, తెర్లాంలో 1,500 మందిని గుర్తించాం. వీరందరికీ సొంత స్థలాలు ఉంటే ఇళ్లు మంజూరు చేస్తారు. కొత్తగా స్థల సేకరణకు రెవెన్యూ శాఖ కసరత్తు చేస్తోంది.

ప్ర: ఇంతవరకు ఎంతమందికి మంజూరు చేశారు?

జ: నియోజకవర్గ పరిధిలో చేపట్టిన సర్వే ప్రకారం 6,433 మంది లబ్ధిదారులను గుర్తించాం. బొబ్బిలి పట్టణంలో పీఎంఏవై-యు 2.0 పథకంలో 224 మందికి మంజూరు చేశాం.

ప్ర: ఇళ్ల నిర్మాణ ప్రగతి ఎలా ఉంది?

జ: బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో బొబ్బిలి అర్బన్, రూరల్, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లో మొత్తం 11,012 ఇళ్లు మంజూరయ్యాయి. ఇంతవరకు 7,585 ఇళ్లను పూర్తి చేసి రూ.143.18 కోట్లు బిల్లులు చెల్లించాం. వీటిలో 102 లేఅవుట్‌లలో 3,978 ఇళ్ల స్థలాల్లో రూ.43.81 కోట్లు ఖర్చు చేసి 1,588 ఇళ్లను పూర్తి చేశాం. సొంత స్థలాలు ఉన్న వారిలో 7,034 మందికి ఇళ్లను మంజూరు చేశాం. వాటిలో రూ.99.366 కోట్లు ఖర్చు చేసి 5,997 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశాం. ఇంకా నిర్మాణం చేపట్టని సుమారు 570 ఇళ్లను ప్రభుత్వం రద్దు చేసింది.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే విజయచంద్ర



సభకు హాజరైన మహిళలు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఉచిత బస్సు పథకం విజయవంతమైన సందర్భంగా మంగళవారం స్థానిక పాతబస్టాండ్ కూడలి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ పూర్తి స్థాయిలో అమలు చేయనున్నట్టు చెప్పారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించినది కూటమి ప్రభుత్వమేనని అన్నారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేస్తున్నారని... తమది మహిళా పక్షపాత ప్రభుత్వం అనడానికి స్త్రీ శక్తి పథకమే నిదర్శనమన్నారు. నెలరోజుల వ్యవధిలో 6 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు సదుపాయాన్ని వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. పథకాల అమలులో దేశంలోని అన్ని రాష్ట్రాలకు మన ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రజల సమస్యలను గాలి వదిలేయబోమని చెప్పారు. వైసీపీ ఫేక్ ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాహనదారులను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

అయినా.. మందుబాబులు మారలేదు

- ఆగని డ్రంకెన్ డ్రైవ్ కేసులు

కేసుల వివరాలు ఇవీ..

సంవత్సరం	కేసులు	జరిమానా
2024	5,853	రూ.1 కోటి 15 లక్షల 6 వేలు
2025 (జూలై వరకూ)	3,013	రూ.63 లక్షల 30 వేలు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తగ్గడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు పోలీసులు తనిఖీలు చేపట్టి... కొత్త నిబంధనల ప్రకారం జరిమానాలు విధిస్తున్నా... కేసులు మాత్రం తగ్గడం లేదు. గతంతో పోల్చితే పోలీసు తనిఖీలు పెరిగినా... మందుబాబులు మాత్రం మారడం లేదు. ముఖ్యంగా బార్లు, వైన్ షాపుల వద్దకు వాహనాలలో వెళ్లి.... అక్కడ పూటుగా తాగి...తిరిగి వాటిపైనే తిరుగుముఖం పడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలకు కారణమవుతున్నారు. మద్యం తాగి డ్రైవ్ చేసే వారి కారణంగా ఇటీవల ప్రమాదాలు పెరుగుతున్నాయి. దీనిపై కేసులు పెడుతున్నా.. వారిలో మార్పు రావడం లేదన్న అభిప్రాయాన్ని పోలీసు వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

పట్టుబడితే రూ.10 వేలు..

మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే... న్యాయస్థానం రూ.10 వేలు జరిమానా విధిస్తుంది. అంతే కాదు... మద్యం తాగి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అనేక మంది గాయపడుతున్నారు. కొందరు మృత్యువాత పడుతున్నారు. వీటిని నివారించేందుకు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నాం.

-సూరినాయుడు, సీఐ, ట్రాఫిక్ విభాగం, విజయనగరం





ముత్యాలమ్మతల్లి, తోగాలమ్మ తల్లి

అమ్మవార్లకు పుష్పాలంకరణ

భోగాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుడివాడ పంచాయతీలో గల ముత్యాలమ్మ, తోగాలమ్మ అమ్మవార్లను మంగళవారం భక్తులు పూలతో సుందరంగా అలంకరించారు. గుడివాడతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు.

వాడవాడలా వారాల పండుగ



బొండపల్లి: ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

బొండపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పైడితల్లి అమ్మవారి పండగను పురస్కరించుకుని వాడవాడలా వారాల పండుగలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కనిమెరక, గిట్టుపల్లి, దేవుపల్లి, గొల్లుపాలెం, రాచకిండాం తదితర గ్రామాల్లో పైడితల్లమ్మ వారాల పండగను ఘనంగా చేపట్టారు. దేవుపల్లి గ్రామంలో భక్తులు ప్రభలతో అమ్మవారిని ఊరేగింపుగా చదురు గుడికి ఆహ్వానించారు. కనిమెరక గ్రామంలో పైడితల్లమ్మవారిని భక్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.



వేపాడ: అమ్మవారి ఆలయానికి వెళుతున్న భక్తులు

- వేపాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల ప్రజలు మంగళవారం వారాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరినాట్లు పూర్తయిన తరువాత వారాల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేపాడ, వీలుపర్తి తదితర గ్రామాల్లో గ్రామ దేవతలు నేరెళ్ల పైడిమాంబ, ముత్యాలమ్మ, పరదేశమ్మ తదితర అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమలు, చీరెలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ4 లక్ష్యం

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యమని జేసీ సేతుమాధవన్ చెప్పారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చేలా కృషి చేయాలని కోరారు. దీనికి సచివాలయ సిబ్బంది కీలకపాత్ర పోషించాలన్నారు. అనంతరం సీపీవో మాట్లాడుతూ మండలానికి ఇద్దరు మాస్టర్ ట్రైనీలు, 12 టీవోపీటీలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక యాప్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలి

వేపాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కుమ్మపల్లి గ్రామంలోని చేపడుతున్న జియో సెల్ టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని ఆ గ్రామంలోని ఎస్సీ కులస్థులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా చేపడుతున్న ఈ సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన లక్ష్మణనాయుడు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు చీపురుపల్లికి చెందిన రెడ్డి లక్ష్మణనాయుడు ఎంపికయ్యాడు. ఈ నెల 14న విశాఖపట్టణంలోని మహారాణి వీధి మర్రిపాలెం అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ ఎంపికల్లో లక్ష్మణనాయుడు ఎంపికయ్యారు. డిసెంబరు 14, 15 తేదీల్లో చండీఘర్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నారు. వీరిని జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శంకరరావు, కోరాడ శంకరరావులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు కొండగుంపాం విద్యార్థులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొండగుంపాం ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అదపాడ ఎర్రబాబు, పదో తరగతి విద్యార్థి శనపతి ధర్మేంద్రలు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కొండవెలగాడలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వేణుగోపాలరావు మంగళవారం తెలిపారు. వీరిని హెచ్‌ఎంతోపాటు పీఈటీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమాచారం ఇవ్వడం లేదు

భోగాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా జనసేన పార్టీ తమకు సమాచారం ఇవ్వడం లేదని టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే గెలుపు కోసం టీడీపీ నాయకులు అనేక త్యాగాలు చేశారని, కానీ ప్రస్తుతం ప్రభుత్వ కార్యక్రమాలపై తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం దారుణంగా ఉందన్నారు.

వీసీలో పాల్గొన్న బంగార్రాజు

భోగాపురం, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జాతీయ ఇఫ్కో బోర్డు మంగళవారం నిర్వహించిన డైరెక్టర్స్ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ ఇఫ్కో బోర్డు డైరెక్టర్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు విషయాలు చర్చించినట్లు తెలిపారు.

యూరియా పంపిణీలో విఫలం

గజపతినగరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియా పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ వచ్చిన నాటి నుంచి రైతులు విత్తనాలు, ఎరువుల కోసం రోడ్డెక్కిన పరిస్థితి మంత్రి తీసుకురావడం శోచనీయమన్నారు. ఏడాదిన్నర కాలంగా నియోజకవర్గాన్ని మంత్రి గాలికి వదిలేశారని ఆరోపించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

రాజాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పీఎఫ్ విషయంలో తలెత్తిన సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేని కలిసిన ఆర్.నారాయణమూర్తి

రాజాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఆర్.నారాయణమూర్తి తీసిన సినిమాలు నేటి తరం యువతను ఎంతో ప్రభావితం చేస్తున్నాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేని కలిశారు. ఈసందర్భంగా పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి జీవితం ఎంతో మందికి స్ఫూర్తిని నింపిందని కొనియాడారు.

ఎనిమిదేళ్లుగా అర్ధాంతరంగానే..

- సగంలో నిలిచిన కలవచర్ల పంచాయతీ భవన నిర్మాణం

గుర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవచర్ల గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణ పనులు గత ఎనిమిదేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ నిర్మాణాన్ని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. 2017 సంవత్సరంలో అప్పట్లో మంత్రిగా ఉన్న కిమిడి మృణాళిని ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సుమారు రూ.15లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. కొంత మేర పనులు చేపట్టారు. ఆ తర్వాత పూర్తిగా పనులు నిలిపివేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ఈ భవనాన్ని పూర్తి చేసి, సచివాలయంగా మార్చాల్సి ఉంది. కానీ అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ నిర్మాణానికి అతీగతీ లేదు. దీంతో పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

నిధులు మంజూరు కాలేదు

నిధుల కొరత.. ప్రభుత్వం మారిపోవడంతో పనులు నిలిచిపోయాయి అప్పటి నుంచి ఇప్పటివరకు ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా ఈ భవనాన్ని పూర్తిచేయాలి

- ఎడ్ల గోపినాయుడు, సర్పంచ్, కలవచర్ల



పిల్లర్లకే పరిమితమైన పంచాయతీ భవన నిర్మాణం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చాకివలస రోడ్డుకు శంకు స్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి మంగళవారం శంకుస్థాపన చేశారు. ముక్కాం రహదారి నుంచి తోటపల్లి మీదుగా కంచేరు వరకు, బమ్మిడిపేట మీదుగా కంచేరు వరకు తారురోడ్డు, ఎన్‌హెచ్ 16 నుంచి చాకివలస మీదుగా ముగడపేట వరకు, అమటాం మీదుగా కవులవాడకు తారురోడ్లుకు శంకుస్థాపన చేశారు. మహరాజపేటలో జనసైనికుల సొంత నిధులతో నిర్మించిన మురుగు కాలువను ప్రారంభించారు. సర్పంచ్ ఊడికల అప్పయ్యమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రీ, నాయకులు వందనాల రమణ, పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఎవరూ పాల్గొనలేదు.

జీఎంఆర్ సేవలు స్ఫూర్తిదాయకం



వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీలో చెత్త సేకరణ కోసం కోటి రూపాయాలు విలువ చేసే ఒక ట్రేసర్, రెండు ట్రాక్టర్లను ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎంఆర్ అందజేశారు. వీటిని మంగళవారం జీఎంఆర్ ఐటీలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. జీఎంఆర్ పీఏ రెడ్డి అన్నంనాయుడు, ఐటీ ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, టీడీపీ నాయకులు పిన్నింటి మోహన్‌రావు, కిమిడి అశోక్‌కుమార్, దూబ ధర్మారావు, లక్షుభుక్త కృష్ణమూర్తి, కమిషనర్ జె.రామప్పలనాయుడు, ఎస్ఐ చేగొండి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను రెగ్యులర్ పోస్టుల్లో నియమించాలి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): క్లస్టర్‌లో ఉన్న ఉపాధ్యాయులను రెగ్యులర్ పోస్టుల్లో నియమించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు కె.జోగారావు, చిప్పాడ సూరిబాబులు కోరారు. మంగళవారం వారు ఆర్‌జేడీ విజయభాస్కర్‌ని కలిసి, వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్ జిల్లా బదిలీల్లో వారి కంటే ముందుగా శాశ్వత ప్రాతిపదికన స్థానాలు కేటాయించి క్లస్టర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఆటో యూనియన్ల బంద్

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సుల వల్ల నాలుగు లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు లేక రోడ్డున పడ్డారని, దీనిని నిరసిస్తూ బుధవారం బంద్ పాటిస్తున్నామని ఏఐఎఫ్‌టీయూ ప్రతినిధి రెడ్డి నారాయణరావు, సీఐటీయూ ప్రతినిధి సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీవో వేధింపులు నిలుపుదల చేయాలని, ఆటో డ్రైవర్లకు బీమా సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో ఈ బంద్‌ని పాటిస్తున్నామని చెప్పారు. కోట వద్ద నుంచి గంటస్తంబం మీదుగా మయూరి కూడలి వరకూ భారీ నిరసన చేపడుతున్నామన్నారు. ఆటో కార్మికులు భారీఎత్తున పాల్గొని జయప్రదం వారు పిలుపునిచ్చారు.

జేఎన్‌టీయూ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

విజయనగరం రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిటాచీ సంస్థ సహకారంతో జేఎన్‌టీయూకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులకు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆరుగురు విద్యార్థినులకు మంగళవారం ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ జి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, హిటాచీ సంస్థ ప్రతినిధి మోహన్ కార్లే, చీఫ్ టెక్నాలజీ అధికారి రెహ్మాన్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు మహాలక్ష్మి, ఆర్.అప్పారావు, వల్లీదేవీ, ఈఈఈ విభాగాధిపతి వకుళ, డా.సౌభాగ్యలక్ష్మి, టి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను, ఇరుసుమాను చెట్ల గుర్తింపు

- నేడు కొండతామరాపల్లిలో పూజలు

విజయనగరం రూరల్/గంట్యాడ/ కల్చరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవానికి సంబంధించి కీలక ఘట్టం మంగళవారం జరిగింది. సిరిమాను, ఇరుసు మాను చెట్లను గుర్తించారు. వాటికి బుధవారం పూజలు చేయనున్నారు. సిరిమాను కోసం ఒక చెట్టు, సిరిమానుకు అమర్చేదానిని ఇరుసు మాను అంటారు. ఈ రెండు చెట్ల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. పూజారి బంటుపల్లి వెంకటరావు కలలో పైడిమాంబ సాక్షాత్కరించి సిరిమాను చెట్లను గంట్యాడ మండలం కొండతామరాపల్లి గ్రామంలోని చల్ల అప్పలనాయుడు, చల్ల నారాయణమూర్తి, చల్లా రామకృష్ణల కల్లాల్లో గుర్తించారు. అదే విధంగా ఇరుసు మాను చెట్టును లోకవరపు సత్యం కళ్లాల్లో గుర్తించారు. ఆ చెట్లకు సంప్రదాయబద్ధంగా దేవదాయశాఖాధికారులు, పైడిమాంబ ఆలయ అర్చకులు, పూజారి వెంకటరావు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకు పురోహితులు బుధవారం ఉదయం 9.15 గంటలకు ముహూర్తంగా నిర్ణయించారు. దేవదాయశాఖాధికారులు ఆయా చెట్ల యాజమానుల వద్దకు వెళ్లి విషయం చెప్పి వాటికి పూజలు నిర్వహించనున్నారు. సిరిమాను, ఇరుసుమాను చెట్లను తమ గ్రామంలో గుర్తించినందు కు కొండతామరాపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 22 తరువాత భారీ ఊరేగింపు నడుమ సిరిమాను చెట్లను విజయనగరం తీసుకువస్తారు.

నేటి నుంచి స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్

- డీఎల్ఏడీవో రాణి

గజపతినగరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లెప్రర్సీ అండ్ ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి (డీఎల్ఏడీవో) రాణి అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యాధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు జిల్లాలో గల అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రిలతో పాటు జిల్లా ఆసుపత్రిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. రోగులకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అలాగే పోషణ అభియాన్, తల్లిబిడ్డల సేవలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, కిశోరబాలికల ఆరోగ్య పరీక్షలతోపాటు క్షయవ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్యసేవలు అందిస్తారని ఆమె వివరించారు. అలాగే ప్రతిరోజూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు మెరుగైన సేవలు అందజేస్తారని చెప్పారు. ఏరియా ఆసుపత్రి సూపరిం టెండెంట్ జగదీష్, వైద్యులు పాల్గొన్నారు. ● శృంగవరపుకోట: ఈనెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్ర మం నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. వైద్యాధికారిణి హారిక, ఎంపీడీవో సతీష్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఘనంగా పైడిమాంబ పండుగ

- నగర మేయర్ లక్ష్మి



మాట్లాడుతున్న మేయర్ లక్ష్మి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 16(ఆంధ్ర జ్యోతి): పైడిమాంబ జాతర మహోత్సవాన్ని అందరి సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తా మని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపా రు. మంగళవారం స్థానిక నగరపాలక సమావేశ మం దిరంలో ఆమె అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావే శం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 21 అంశాలకు ఆమోదం తెలిపారు. అలాగే అనుబంధంగా చేర్చిన మూడు అంశాలు కూడా సభ్యులు ఆమోదిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైడిమాం బ మహోత్సవానికి నగరపాలక సంస్థ ద్వారా రూ.60లక్షల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి భక్తులకు నగరవాసులకు ఈ సదుపాయాలు కల్పించనున్నట్టు తెలిపారు. పాక్షిక మరమ్మతులు నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు. అలాగే తాగునీటి పంపిణీ, వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించామన్నారు. సమావేశంలో కమిషనర్ పి.నల్లనయ్య, ఫ్లోర్‌లీటర్ ఎస్‌వీవీ రాజేష్, సభ్యులు అల్లు చాణక్య, జీవీ రంగారావు, సుంకరి నారాయణస్వామి, రేగాన రూపావతి దేవీ, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, వివిధ విభాగ అధికారులు పాల్గొన్నారు.

భారత్ విద్యా సంస్థల భాగస్వామ్యానికి ఫ్రాన్స్ సిద్ధం



మాట్లాడుతున్న ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామి

నెల్లిమర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భారత్‌లోని విద్యా సంస్థలతో భాగస్వామ్యానికి ఫ్రాన్స్ ఎల్లప్పుడూ సిద్ధమని ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామి అన్నారు. స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నైపుణ్యాలను పెంపొందించేందుకు యూనివర్సిటీ నిర్వహిస్తున్న అనుబంధ కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఫ్రాన్స్ దేశం వివిధ విద్యా సంస్థలతో నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ డీఎన్.రావు, చాన్సలర్ జీఎస్ఎన్.రాజు, వైస్ చాన్సలర్ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డా.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

'మన డబ్బులు మన లెక్కలు' యాప్‌పై అవగాహన

నెల్లిమర్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మన డబ్బులు.. మన లెక్కలు యాప్‌పై ప్రతి మహిళా అవగాహన పెంచుకోవాలని వెలుగు ఏపీఎం సురేష్ సూచించారు. మన డబ్బులు, మన లెక్కల పేరిట ప్రభుత్వం నూతనంగా రూపొందించిన యాప్‌ను అమలు చేసేందుకు మండలంలోని మధుపాడ గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసిందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆ గ్రామంలో మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా మహిళా సంఘాల రుణాలు, పొదుపు అంశాలతోపాటు ప్రతి సభ్యురాలి వ్యక్తిగత వినియోగం ఖర్చు తదితర అంశాలు కూడా పొందుపరుస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఎల్‌సీ నరసింగరావు, సుజాత, వినో అధ్యక్షురాలు, సీసీలు, వీవోలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోండి

- డీసీసీబీ చైర్మన్ నాగార్జున



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ నాగార్జున

చీపురుపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు తమ ఖాతాలను సహకార బ్యాంకు బ్రాంచిల్లో తెరవాలని ఆయన సూచించారు. బ్యాంకు కార్యకలాపాల పట్ల తమ తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో తమ బ్యాంకుకు 24 బ్రాంచిలు ఉన్నాయన్నారు. రైతుల శ్రేయస్సుతో బాటు వాణిజ్య బ్యాంకులకు దీటుగా బ్యాంకు సేవలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో ఉమామహేశ్వరరావు, చీపురుపల్లి మేనేజరు వాసు, రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ వైస్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిందాల్ పరిశ్రమకు తమ భూములు ఇచ్చి 18 ఏళ్లు అయినా పరిశ్రమ రాలేదని.. అప్పటి నుంచి పరిశ్రమ యాజమాన్యం తమకు ఎంత డబ్బు ఇచ్చిందో అంతా తిరిగి ఇచ్చేస్తామని.. తమ భూములు తమకు వెనక్కి ఇవ్వాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు మంగళవారం బొడ్డవర గ్రామం వద్ద నిరసన నిర్వహించారు.

ఫిర్యాదుపై 19న విచారణ

జిందాల్ నిర్వాసితులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు గతంలో చేసిన ఫిర్యాదుపై ఈనెల 19న హైదరాబాద్‌లో విచారణ నిర్వహిస్తున్నట్టు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. మంగళవారం బొడ్డవర గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిందాల్ నిర్వాసితుల సమస్యపై తాను గత నెలలో జాతీయ ఎస్టీ, ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించానని, ఈనెల 10వ తేదీన నిర్వాసితులు స్వయంగా వెళ్లి కలిశారని ఆయన చెప్పారు. ఈసందర్భంగా ఈ అంశంపై నిగ్గు తేల్చేందుకు జాతీయ ఎస్టీ కమిషన్ 19న విచారణ చేపట్టనున్నదని ఆయన తెలిపారు. ఈ విచారణకు తనతోపాటు నిర్వాసితులు రావాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శితో పాటు జిల్లా కలెక్టర్ హాజరవుతారని ఆయన తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

కొత్తవలస, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లోని పీడబ్ల్యూ కార్యాలయ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్టు వీఆర్వో రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జోగారావు మంగళవారం తెలిపారు. వీఆర్వో సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. మృతుడి వయస్సు సుమారు 25 ఏళ్లు ఉంటుందన్నారు. ఫ్యాంట్, టీషర్టు వేసుకుని ఉన్నాడని తెలిపారు. మృతుడు అనారోగ్య కారణం వల్ల గానీ, అతిగా మద్యం తాగడం వల్ల గానీ మృతిచెంది ఉండొచ్చని వీఆర్వో తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు కొత్తవలస పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించామని ఎస్ఐ చెప్పారు.

ఉణుకూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

రేగిడి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉణుకూరు ఫీల్డ్‌అసిస్టెంట్ జగన్నాథం నాయుడు అనర్హులకు ఉపాధి పనులు వర్తింపచేస్తున్నారని అదే పంచాయతీ పరిధిలోని పోరాం గ్రామానికి చెందిన పోరెడ్డి విశ్వనాథం ఇటీవల పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో మంగళవారం స్థానిక ఏపీవో శ్రీనివాసరావు ఫీల్డ్‌అసిస్టెంట్‌ను, ఫిర్యాదుదారున్ని వేర్వేరుగా విచారించారు. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు వర్కు డిమాండ్ ఇవ్వటం, ఇంకా అనర్హులకు జాబ్ కార్డులు ఇచ్చి హౌసింగ్ బిల్లులు ఇవ్వటం అభ్యంతరకరమని ఏపీవోకు ఫిర్యాదుదారుడు నివేదించారు. తాను ఎటువంటి అవకతవకలకు పాల్పడలేదని, జాబ్ కార్డులు అర్హులేకే జారీ చేశానని ఆధారాలతో ఫీల్డ్‌అసిస్టెంట్ విచారణ అధికారికి నివేదించారు. అంగన్‌వాడీ కార్యకర్తకు వర్కు డిమాండ్ ఇవ్వటంపై రికార్డులు పరిశీలించి.. ఎంపీడీవోకు సమగ్ర నివేదిక అందిస్తానని ఏపీవో తెలిపారు.

మాయ మాటలు నమ్మొద్దు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులు మోసగాళ్లు చెప్పే మాయమాటలు విని జీవితాలు నాశనం చేసుకోవద్దని మహిళా పీఎస్ డీఎస్పీ గోవిందరావు అన్నారు. పూల్‌బాగ్‌లోని కేజీబీవీలో విద్యార్థినులకు శక్తియాప్‌పై, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్‌లో శక్తి యాప్ నిక్షిప్తం అయి ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని చెప్పారు. ఆటోల్లో ప్రయాణించినప్పుడు సేఫ్ ట్రావెల్ ఆప్షన్ క్లిక్ చేసి చేరుకోవలసిన ప్రాంతాన్ని నమోదు చేస్తే, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేంతవరకూ వారి ప్రయాణంపై పోలీసులు నిఘా పెడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శిరీష, శక్తి బృందం కానిస్టేబుల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల కేటాయింపునకు యోచన

శృంగవరపుకోట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట-అరకు రోడ్డులో డ్రైనేజీ నిర్మాణంలో దుకాణాలు కోల్పోయిన వారికి పాత బస్టాండ్ ఆవరణలో వ్యాపారాలు చేసుకునే విధంగా ఏర్పాటుకు యోచన చేస్తున్నట్టు సర్పంచ్ సంతోష్‌కుమారి తెలిపారు. మంగళవారం నిర్వహించిన పంచాయతీ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై ఈవో అనురాధ ఆధ్వర్యంలో తీర్మానాలు చేశారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమకు ఐదు నెలల జీతం బకాయిలు ఉన్నాయని, అయితే మూడు నెలలు ఇవ్వాలని కోరుతుంటే కేవలం రెండు నెలలు ఇస్తామని అంటున్నారని తాము అంగీకరించబోమని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోపాడ కుమార్, పంచాయతీ వార్డు సభ్యులు వున్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

మెంటాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఈ సమావేశంలో పలువురు వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు.. మండలంలో యూరియా కొరత ఉందని ఏవో కృష్ణపై విరుచుపడ్డారు. యూరియా కొరత లేదని ఏవో చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సాలూరు ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ కలుగజేసుకుని యూరియా కొరత అనేది కేవలం వదంతుల వల్లే వ్యాప్తి చెందిందని చెప్పారు. అలాగే పలు సమస్యలను ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, తహసీల్దార్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బంగార్రాజుకు కృతజ్ఞతలు



బంగారాజ్రును సత్కరిస్తున్న దృశ్యం

భోగాపురం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గంలో ఇటీవల నామినేటెడ్ పదువుల జాబితాలో స్థానం కల్పించినందుకు సంబంధిత వ్యక్తులు మంగళవారం పోలిపల్లి గ్రామంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులపైన చీకటి సుహాసని, రాష్ట్ర నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లా సూరిబాబు, ఏఎంసీ డైరెక్టర్ పిన్నింటి రామకృష్ణ, దీపిల్లి బంగారమ్మ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

గరివిడి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించి గ్రామాలను పట్టణాలను తలపించే విధంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని చీపురుపల్లి డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) హేమసుందర్ అన్నారు. కొండలక్ష్మీపురం గ్రామాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. శానిటేషన్, ఎస్‌డబ్ల్యూపీసీ, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులపై ప్రజలతో చర్చించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే అధికారులు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు అలవర్చుకోవాలి



డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న దృశ్యం

బొండపల్లి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పద్ధతులు అలవరుచుకోవాలని ఏవో కె.మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం కనిమెరక గ్రామంలో డ్రోన్‌తో పురుగు మందులు, ఎరువులు పిచికారీ చేశారు. వెదురువాడకు చెందిన శ్రీరామచంద్రయ్య వ్యవసాయ సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.9.80 లక్షలు విలువైన డ్రోన్‌ను 80 శాతం రాయితీపై అందించిందని తెలిపారు. ఏపీఎల్ఎన్ఎఫ్ ఏవో స్వామినాయుడు, రీజనల్ కోఆర్డినేటర్ హేమసుందర్, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

చదువు కోవాలంటే కొండ దిగాల్సిందే!

(5వ పేజీ తరువాయి)

మన్యంలో ఏడు పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మిస్తోంది. ఈ పనులు చివరిదశకు చేరుకున్నాయి. కాగా గిరిజన గ్రామాల్లో డ్రాపౌట్లు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం గిరిజన విద్య బలోపేతం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రాపౌట్ల సంఖ్య మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. బడిబయట ఉన్న చిన్నారులను గుర్తించి వారిని బడిలో చేర్పించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. డ్రాపౌట్‌గా మారిన విద్యార్థులు కొండపోడు, కూలీ పనులు చేసుకుంటూ ఇంటికే పరిమితమై వారి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పక్కా భవనాలు లేని గిరిజన ప్రైమరీ పాఠశాలల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. విద్యార్థుల సమస్యలను కూడా అందులో ప్రస్తావించాం. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

-జి.రామ్మోహనరావు, డిప్యూటీ ఈవో

ఏడు పాఠశాలలకు పక్కా భవనాలు

రేకుల షెడ్లలో నిర్వహిస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల వివరాలను ఇటీవలే ప్రభుత్వానికి పంపాం. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడులో కింద మంజూరైన పాఠశాలల భవనాలు పునాది దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం గిరిశిఖర గ్రామాల్లో ఉన్న ఏడు పాఠశాలలకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ పనులు జరుగుతున్నాయి.

-ఆనందరావు, ఎంఈవో, సీతంపేట

ఆదమరిస్తే.. ఆసుపత్రికే!

(5వ పేజీ తరువాయి)

చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో అవి అంతగా కనిపించడం లేదు. ఏ వాహనమైనా అదుపు తప్పి గుంతలోకి దూసుకెళ్తే.. ఇక అంతే పరిస్థితి. నేరుగా ఆసుపత్రికి చేరుకోవాల్సిందే. వాహనాలు క్రాస్ అయితే భారీ ప్రమాదం తప్పదు. 17 పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు, అధికారులు నిత్యం ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రధాన రహదారికి ఆనుకుని పెద్ద పెద్ద గుంతలున్నా.. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారీ ప్రమాదం సంభవించకముందే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ సుశీలను వివరణ కోరగా.. 'ఎం.అల్లువాడ - తుంబలి గ్రామాల మధ్య ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న భారీ గోతులతో ఇబ్బందికరమే. ఈ విషయం బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులకు తెలియజేశాం. మరోసారి వారికి చెప్పి గోతులను పూడ్చే చర్యలు తీసుకుంటాం.' అని తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

(5వ పేజీ తరువాయి)

యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ప్రతీ పాఠశాలను పరిశుభ్రంగా ఉండాలని, మౌలిక వసతులు లోటు ఉండరాదని తెలిపారు. మంగళవారం రావికోన గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత విద్యార్థుల హాజరు, స్టోర్‌రూం, స్టాక్ రిస్టర్లు, కిచెన్ షెడ్, టాయిలెట్లు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. పాఠశాలలో పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. అంతకుముందు విద్యార్థులతో కాసేపు మాట్లాడి.. నోట్, వర్క్ బుక్స్‌ను తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాలు మరింత పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం పెదబొండపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది తీరు, ఉచిత మందుల పంపిణీపై ఆరా తీశారు. అక్కడి నుంచి నేరుగా పెద్దబొండపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకుని రికార్డులు పరిశీలించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 27 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు. ఈ నెల 29న నిర్వహించనున్న కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించంచారు. అభ్యర్థులు మొబైల్ నెంబరు, ఈమెయిల్ ఐడీ ఎట్టి పరిస్థితుల్లో మార్చరాదన్నారు. వివరాలకు 9052508903, 8886789002 నెంబర్లను సంప్రదించాలన్నారు.

●సీతంపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్లకు నాలుగో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 27 వరకు వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 28న మధ్యాహ్నం 2 గంటలలోగా తమ నమోదు యునీక్ నెంబర్‌తో పాటు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో తమ దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐలోనైన వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 7569062449, 9491134464 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఖరాసవలస కేజీబీవీ ఎస్‌వోగా నజియా

సాలూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరాసవలస కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యే అధికారిగా షేక్ నజియా నియమించినట్టు సమగ్రశిక్ష ఏపీసీ తేజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఖరాసవలస ఎస్‌వో ప్రశాంతిని కొద్ది నెలల క్రితం సస్పెండ్ కావడంతో ఇన్‌చార్జి ఎస్‌వో షబ్నం బాధ్యతలు నిర్వర్తించేవారు వ్యక్తిగత కారణాలతో బాధ్యతలను తాను నిర్వహించలేని ఆమె అధికారులకు విన్నవించారు. దాంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జి ఎస్‌వోగా నజియాకు బాధ్యత అప్పగించారు.

బోధనేతర పనులను అప్పగించవద్దు

బెలగాం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రెడ్డి మోహన్‌రావు డిమాండ్ చేశారు. అలాగే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో నీలకంఠాపురంలో చేపట్టిన రణభేరి ప్రచార జాతా మంగళవారం పార్వతీపురం చేరుకుంది. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కిషోర్ కుమార్, కె.విజయ, మురళీమోహన్, జిల్లా నాయకులు కె.భాస్కరరావు, రమేష్ పాల్గొన్నారు.

'మన డబ్బులు.. మన లెక్కలు' యాప్

సాలూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లో సభ్యుల డబ్బుల లావాదేవీలు పారదర్శకతను మన డబ్బులు, మన లెక్కలు యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వెలుగు సాలూరు ఏపీఎం ఎ.జయమ్మ అన్నారు. ఆమె మంగళవారం మామిడిపల్లిలో ఈ యాప్‌పై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ తిరుమల, వీవోఏ బాలకృష్ణ, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

గరుగుబిల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి గ్రామానికి చెందిన ఆవాల రామకృష్ణను బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నియామక పత్రాన్ని జారీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నియామకానికి కృషి చేసిన బీసీ సంక్షేమ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పాలకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముదునూరువారి వీధిలోని కోదండరామాలయంలో సోమవారం రాత్రి శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం విశ్వక్షేణ పూజ, పుణ్యాహవచనం, విశేష అర్చన నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊంజల్ సేవ, దూప హారతి, నక్షత్రహారతితో నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పి.వి.ఎస్.రాంజీ, రమణాచార్యులు పాల్గొన్నారు. ఈవో టి.శివకేశ్వరరావు, సిబ్బంది దుర్గారావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

మండల అభివృద్ధికి సహకరించండి

●మండల సమావేశంలో ఎమ్మెల్యే జయకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బొమ్మాళి భాను అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం మరెన్నో సంక్షేమ ఫలాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఏడాదిన్నర పాలనలో సూపర్ సిక్స్ ద్వారా ఉచిత గ్యాస్, తల్లికి వందనం, పింఛన్ల నగదు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేశామన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామన్నారు. పంచాయతీల అభివృద్ధిలో భాగంగా రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయం, రెవెన్యూ సమస్యలు అధికంగా వస్తున్నాయని, వాటిపై శాఖాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ చర్చలో రైతులకు ఈ ఏడాది సరిగా ఎరువులు అందలేదని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే మండలంలో 1100 మెట్రిక్ టన్నులపైగా యూరియా సరఫరా చేశామని ఏవో ప్రసాదరావు బదులిచ్చారు. మరిన్ని ఎరువులు అవసరమని, జేడీతో మాట్లాడి ఎరువుల సరఫరా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పాలవలస మురళీధర్, వైస్ ఎంపీపీ వాకమూడి అనీల్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, కూటమి నాయకులు జాడ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని అడ్డుకున్న పోలీసులు

మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను కార్యాలయ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో 2 గంటల పాటు హైడ్రామా నడిచింది. ప్రజా సమస్యలపై చర్చించేందుకు వచ్చిన తనను అడ్డుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల సమావేశానికి ఆహ్వానించి తనను అవమానించారని ఆక్షేపించారు. దీనిపై డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ప్రసాదరావు ఇన్‌చార్జి ఎంపీడీవో పాలవలస మురళీధర్‌తో చర్చించారు. రాతపూర్వకంగా ఎందుకు అనుమతించడం లేదో బదులు ఇవ్వాలని ఎంపీడీవోను కోరారు. తాను ఒత్తిడిలో ఉండి ఎమ్మెల్సీకి హడావుడిగా ఆహ్వానం పంపించానని ఎంపీడీవో బదులిచ్చారు. మండల పరిషత్ సమావేశానికి హాజరుకావడానికి ఎమ్మెల్సీకి అనుమతి లేదని స్పష్టం చేశారు. దీనిపై ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. మండల సమావేశానికి రావడానికి హక్కు ఉందో లేదో కోర్టులో తేల్చుకుంటానని చెబుతూ ఎమ్మెల్సీ వెనుదిరిగారు. ఆయనతో పాటు జడ్పీటీసీ సభ్యురాలు గౌరీపార్వతి, వైసీపీ నాయకులు కనపాక సూర్యప్రకాశ్, పాలవలస దవళేశ్వరరావు, కోట అజయ్, ఉపేంద్ర, ఎం.రాంబాబు ఉన్నారు.

సాలూరులో ముగిసిన రణభేరి జాతా

సాలూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రారంభమైన యూటీఎఫ్ రణభేరి జాతా మంగళవారం సాలూరులో ముగిసింది. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బోడెల విజయకుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్రనేతలు విజయ గౌరి, రెడ్డి మోహనరావు, మురళీమోహన్, కిశోర్‌కుమా పాల్గొ న్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రమేష్, ప్రభాకర్, రాజమణి, సింహాచలం, అనకాపల్లి గణేష్, మన్మథరావు, జగదీష్, అవ్వ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రణభేరి ప్రచార జాతాకు స్వాగతం

●సీతానగరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి ప్రచార జాతా మంగళవారం మరిపివలసకు చేరింది. దీంతో యూటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, ఎస్.కిషోర్‌కుమార్, ఎస్.మురళీమోహన్, కె.విజయగౌరితో పాటు సీతానగరం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ముగిసిన ఏపీటీఎఫ్ నిరసన వారం

సాలూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఏపీటీఎఫ్ (257) చేపట్టిన నిరసన వారం కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలని, అసెస్మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని గత వారం రోజులుగా నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మండల, తాలూకా కేంద్రాల్లో ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. నిరసన వారం ముగింపు సందర్భంగా పార్వతీపురంలో డీఆర్వోకు ఏపీటీఎఫ్ నేతలు వినతిపత్ర సమర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మర్రాపు మహేష్, బాలకృష్ణ ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, కార్యదర్శులు ఎస్.కిషోర్‌కుమార్, మురళీమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం సీతంపేట చేరిన ఈ రణభేరి బైక్ జాతాలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులతో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుల సమావేశమయ్యారు. బైక్ జాతాలో మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, స్టేట్ కౌన్సిలర్లు దండు ప్రకాశరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆరిక భాస్కరరావు, కార్యదర్శులు కృష్ణారావు, ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

సీతానగరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాశీపేట సమీపంలో రైలు నుంచి జారిపడి గుప్త మజా (27) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన వివరాల మేరకు.. హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో గుప్త మజా భువనేశ్వర్ నుంచి జైపూర్ వెళుతుండగా కాశీపేట సమీపంలో ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని బొబ్బిలి ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు

మౌలిక సదుపాయాలు కల్పించండి

కొమరాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒడిశా, ఆంధ్రా సరిహద్దులోని రెబ్బ, వనధార గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం రెబ్బ, వనధార గ్రామస్థులతో కలిసి నిరసన తెలిపారు. మండలంలోని చోళపదం పంచాయతీకి చెందిన అటు ఒడిశా, ఇటు అం ధ్రా సరిహద్దు గిరిజన గ్రామాలైన రెబ్బ, వనధార గ్రామాలకు నేటికీ పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యం లేదన్నారు. విద్య, వైద్యం కూడా పూర్తిస్థాయిలో అందని పరిస్థితి ఉందన్నారు. ఇకనైనా కూటమి పాలకులు స్పందించి ఈ రెండు గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని టీడీపీఏ పీవోకు త్వరలో వివరిస్తామన్నారు. కార్యక్రమంలో నగేష్, మహేష్ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్థులను పర్యవేక్షించండి



వివరాలను పరిశీలిస్తున్న ఎన్‌సీడీ పీవో

సీతానగరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులను ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మంగళవారం బూర్జలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అలాగే సంచార చికిత్సా శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. పరీక్షల నివేదికలను గమనించి మందులు వినియోగిస్తున్న విధానం, ఆహార నియమాలు, జీవన శైలిపై వారిని అడిగి తెలుసుకున్నారు. సంచార చికిత్సా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేయాలని డీఈవో, వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది గాయత్రి, 104 సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువులు సక్రమంగా అందించాలి



వ్యవసాయ అధికారితో మాట్లాడుతున్న సభ్యుడు

వీరఘట్టం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు సక్రమంగా అందేలా చూడాలని సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు పోరెడ్డి వెంకటనాయుడు మాట్లాడుతూ ఎరువులు రైతులందరికీ సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తూడి సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, మండల ఉపాధ్యక్షుడు విజయకుమారి, భార్గవ్, విశ్వానరాయి, ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ సాయి కామేశ్వరరావు, వ్యవసాయ అధికారి సౌజన్య పాల్గొన్నారు.


మహిళల ఉపాధికి ఉచిత శిక్షణ

గరుగుబిల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని మహిళలకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకే ప్రభుత్వం ఉచిత శిక్షణ అందించి ప్రోత్సహిస్తోందని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలిం చారు. శిక్షణ పూర్తయిన వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. అనంతరం మహిళలు ఎంపీడీవోను సత్కరించారు. కార్యక్రమంలో శిక్షకులు పెద్దింటి ప్రసన్న, ఇందుమతి పాల్గొన్నారు.

టీచర్లను యథావిధిగా కొనసాగించాలి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులను యథావిధిగా కొనసాగించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేశ్ పాదయాత్ర చేసినప్పుడు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు వారి పోస్టులను డీఎస్సీలో చూపించడం అన్యాయమన్నారు. గిరిజన సంక్షేమ సంక్షేమ శాఖ మంత్రి కూడా ఉద్యోగాలకు ఇబ్బంది ఉండదని చెప్పారని గుర్తుచేశారు. సమావేశంలో ధోని సురేష్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక దివాకర్, నాయకులు శ్రీను, వెంకట్, తిరుపతిరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఓజోన్ దినోత్సవం



సాలూరు రూరల్: మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో..



సీతంపేట రూరల్:గిరిజనసంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో..



వీరఘట్టం: గంగమ్మపేటలోని ఆశ్రమ పాఠశాలలో..



గుమ్మలక్ష్మీపురం కస్తూరిబా విద్యాలయంలో..

(ఆంధ్రజ్యోతి బృందం)

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. దానికి నష్టం కలిగితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. ఓ3 ఆకృతిలో విద్యార్థులు కూర్చుని అందరినీ ఆకట్టుకున్నారు.

టెన్త్ విద్యార్థులపై శ్రద్ధ తీసుకోండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీడీ కృష్ణవేణి

జియ్యమ్మవలస, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని హెచ్‌ఎంలకు గిరిజన సంక్షేమ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి సూచించారు. మంగళవారం ఆమె వనజ, జియ్యమ్మవలసల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణ స్థాయిలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసిన అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైతే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కనీస అభ్యాసన సామర్థ్యం, నాణ్యమైన విద్య, పాఠశాలల సుందరీకరణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.ధనుంజయ నాయుడు, అల్లు రవిప్రసాదరావు, డిప్యూటీ వార్డెన్ హెచ్.సత్యం పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

జియ్యమ్మవలస, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకం ద్వారా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు డిసెంబరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన చిలకలవానివలసలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. బిల్లులకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సందేహాలను నివృత్తి చేశారు. ఆయనతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ధనుంజయ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్

సీతంపేట రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకుంటే బంగారు భవిష్యత్ సాధ్యపడుతుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సీతంపేట ఏజెన్సీలో మంగళవారం ఆయన పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల యోగక్షేమాలు, విద్యా ప్రమాణాల స్థాయిని పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం వివిధ సమస్యలపై గిరిజనులు అందజేసిన వినతిపత్రాలను స్వీకరించారు. కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. కీసరజోడు, మర్రిపాడు గ్రామాల్లోని సచివాలయాలను పరిశీలించి అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూరియ సరఫరా తక్కువగా ఉందని, సరఫరా పెంచాలని గిరిజన రైతులు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ నీలయ్య, జనసేన మండల అధ్యక్షుడు విశ్వనాథం, కూటమి నాయకులు పవన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో రైతులకు మేలు



పంటలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి శ్రావణ్‌కుమార్

మక్కువ రూరల్, సెప్టెంబరు16 (ఆంధ్రజోతి): ప్రకృతి సాగుతో రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి ఎం.శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన పనసభద్రలో ప్రకృతి వ్యవసాయ పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు లభించడమే కాకుండా రైతుకు లాభం చేకూరుతుందన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సౌకర్యాలు మెరుగుపరచాలి

మక్కువ రూరల్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రసామంతవలసలోని గిరిజన సంక్షేయ ఆశ్రమ పాఠశాలను మన్యం జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఎస్.వై.నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా భోజనాలు, వసతి సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వంటశాలను, వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మెనూ రేట్లను పెంచాలన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే సకాలంలో వైద్యం అందించే చర్యలు చేపట్టాలన్నారు. వంట సిబ్బందిని అదనంగా నియమించాలని, సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీఐటీయూ, ఆదివాసీ గిరిజన నాయకులు అర్జప్ప, చిన్నరాజు, మహేంద్ర, రవి ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

బెలగాం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏలు డిమాండ్ చేశారు. మంగళవారం వెలుగు పీడీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎన్నో ఏళ్లుగా మెప్మాలో పనిచేస్తున్న తమను అకారణంగా, రాజకీయ కక్షలతో తొలగించడం అన్యాయమన్నారు. అనంతరం వెలుగు ఏపీడీ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు.